సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం ၊ 7 ၊ సెప్టెంబర్ ၊ 2024



టన్ను చీనీ రూ.24 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24 వేలు, కనిష్టంగా రూ.12 వేల ప్రకారం పలికాయి.



టమాట కిలో రూ.22

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.22, కనిష్టంగా రూ.7 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
36.4°/23.6°

జిల్లా పరిధిలో శుక్రవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

వినాయకుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి

- పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ రత్న



పుట్టపర్తి టౌన్: పార్వతీ నందనుడైన వినాయకుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని, పాడి పంటలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో గడపాలని ఎస్పీ రత్న ఆకాంక్షించారు. వినాయక చవితిని పురస్కరించుకుని జిల్లా వాసులకు ఆమె పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ఓ ప్రకటన విడుదల చేశారు. స్వామి దయతో విఘ్నాలు తొలిగి అందరికీ విజయాలు చేకూరాలన్నారు. గణేష్ నిమజ్జనం జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. వినాయకుని మంటపాల వద్ద జాగ్రత్తలు పాటించాలన్నారు. పర్యావరణ హితం కోరుతూ ప్రతి ఒక్కరూ మట్టితో తయారు చేసిన విగ్రహాలనే కొలువుతీర్చాలని సూచించారు.

10న బుక్కపట్నంలో జాబ్ మేళా

పుట్టపర్తి టౌన్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు 10వ తేదీన బుక్కపట్నం సత్యసాయి డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా ఏర్పాటు చేశారు. జాబ్‌మేళాకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు అర్హులని నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి అబ్దుల్ ఖయ్యూం, కళాశాల ప్రిన్సిపాల్ మక్బూల్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు ఉండాలన్నారు. వేతనం రూ.12 వేల నుంచి రూ. 20 వేల వరకు ఉంటుందన్నారు. ఉద్యోగాల ఎంపికైన వారు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలతో పాటు బెంగళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు బయోడేటాతో పాటు ఆధార్, విద్యార్హత పత్రాలు వెంట తీసుకుని రావాలని సూచించారు. వివరాలకు 79815 41994 నంబరులో సంప్రదించాలన్నారు.

బాలికా విద్యకు అధిక ప్రాధాన్యం

- ఎంజేపీ బాలికల పాఠశాల ప్రారంభోత్సవంలో మంత్రి సవిత



తాత్కాలిక పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్: బాలికా విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఇందుకోసం తగు చర్యలు తీసుకుంటోందని చేనేత, జౌళి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. విద్యార్థినులు బాగా చదువుకుని భవితకు బాటలు వేసుకోవాలన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని రాంపురం బీఈడీ కళాశాలల వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇక్కడ ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు నిర్వహిస్తామని, ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి ఎంజేపీ బాలికల పాఠశాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తామన్నారు. ఇందుకు సంబంధించిన నిధులు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు.

వచ్చాడయ్యో స్వామి..



- ఊరూవాడా చవితి సంబరం
- పలు రూపాల్లో కొలువుదీరుతున్న గణనాథులు
- పండుగ కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిట

సాక్షి, పుట్టపర్తి/హిందూపురం టౌన్/ ప్రశాంతి నిలయం/పుట్టపర్తి టౌన్: చవితి సంబరాలకు ఊరూవాడా సిద్ధమైంది. ఇప్పటికే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మంటపాల్లో శుక్రవారం సాయంత్రం నుంచే బొజ్జ గణపయ్యలను కొలువుదీర్చారు. ఇళ్లలో పూజించేందుకు మార్కెట్లో లభించే రకరకాల గణపతి ప్రతిమలను తీసుకొచ్చారు.

మార్కెట్లు కిటకిట..

వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మార్కెట్లన్నీ కిటకిటలాడాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ధర్మవరం, హిందూపురం, పెనుకొండ, కదిరి, పుట్టపర్తి, మడకశిర తదితర ప్రాంతాల్లో పండుగ సందడి కనిపించింది. జనమంతా మామిడాకులు, చెరకు గడలు, వెలగకాయలు, పండ్లు, పూలు కొనుగోళ్లలో బిజీగా గడిపారు. మరోవైపు ప్రధాన రహదారుల్లో గణేష్ విగ్రహాలను తీసుకువెళ్లే వాహనాలు కనిపించాయి. కాగా కొన్ని చోట్ల మట్టిబొమ్మలనే పూజిద్దామనే నినాదంతో పలువురు ఉచితంగా అందజేశారు.



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న హిందూపురం మార్కెట్

ట్రెండ్‌కు అనుగుణంగా..

జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో ఏటా గణపయ్య 40 చోట్ల పలు రూపాల్లో దర్శనం ఇస్తారు. ట్రెండ్‌కు అనుగుణంగా ఇక్కడ విగ్రహాలు ఏర్పాటు చేస్తారు. వాట్సాప్ గణేశ్, ఫేస్‌బుక్ వినాయక్, ట్విట్టర్ గణపతి, రాకెట్ ఏకదంతుడు, ఇస్రో సైంటిస్ట్ తదితర రూపాల్లో శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఏటా విగ్రహాలు రూపొందిస్తుంది.

'పురం'లో వినాయక వైభవం..

హిందూపురంలో భారీ గణపతులు కొలువుదీరుతున్నాయి. పట్టణ వ్యాప్తంగా సుమారు 200పైగా ప్రతిమలు ఏర్పాటు చేస్తున్నారు. అందులో సగం పైగా మట్టి బొమ్మలు ఉండటం విశేషం. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ తరహాలో.. హిందూపురంలోనూ చాలా చోట్ల విగ్రహాలను ఆయా ప్రాంతాల్లోనే తయారు చేస్తారు. ఇక్కడ 9 రోజుల తర్వాత గణపయ్యను గుడ్డం కోనేరులో నిమజ్జనం చేస్తారు. చవితి నుంచి నిమజ్జనం రోజున నిర్వహించే శోభయాత్ర వరకూ హిందూపురంలో వినాయక వైభవం చూడవచ్చు.

మగ్గం పక్కనే...

వినాయక చవితిని నేతన్నలంతా తప్పక చేస్తారు. తమకు జీవనాధారమైన మగ్గం పక్కనే వినాయకుడి విగ్రహాన్ని ఉంచి.. పూజలు చేస్తారు. అనంతరం పెద్ద విగ్రహాలతో పాటు నిజ్జనానికి పంపుతారు. దీనివల్ల వినాయకుడి వాహనమైన మూషికాల బాధ ఉండదని నేతన్నల నమ్మకం. అందుకే ధర్మవరం, హిందూపురంలోని నేతన్నలు మగ్గం పక్కనే వినాయకుడిని కొలువుదీర్చుతారు.



వినాయకుడి విగ్రహాన్ని తీసుకువెళ్తున్న యువకులు



పుట్టపర్తిలో కిటకిటలాడుతున్న మార్కెట్



ధర్మవరంలో వినాయక ప్రతిమ విక్రయాలు



హిందూపురంలో పండ్లు కొనుగోలు చేస్తున్న మహిళలు



హిందూపురంలో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

'వికసిత్ ఆంధ్రా' ప్రణాళికలు సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్, ఇతర అధికారులు

- కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: 'వికసిత్ ఆంధ్రా' కోసం ఆయాశాఖల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో 'వికసిత్ ఆంధ్రా–2047' యాక్షన్ ప్లాన్‌పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ, వచ్చే ఏడాదిలో 15 శాతం వృద్ధి సాధించే దిశగా జిల్లా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అలాగే అన్ని ప్రాథమిక రంగాల అభివృద్ధికి 100 రోజుల, సంవత్సర ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. వ్యవసాయ, అనుబంధ రంగాలు, పారిశ్రామిక, సేవా రంగాల్లో రాణించిన వారి విజయ గాథలతో నివేదికలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అలాగే హార్టికల్చర్ యాక్షన్ ప్లాన్ ఆధారంగా 'స్వర్ణాంధ్ర–2047' యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. 11వ తేదీ నాటికి ప్రతి శాఖ నుంచి కనీసం రెండు విజయగాథలతో నివేదిక సమర్పించాలన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర–2047' కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు.

ఓపీ సంఖ్య పెరగాలి

జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్‌హెల్త్ సెంటర్లు 59 ఉన్నాయని, ఆయా ఆస్పత్రుల్లో ఓపీ సంఖ్య పెరిగేలా వైద్యులు సేవలందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకోసం డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్ ఆధ్వర్యంలో ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అలాగే మెగా టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ పొందిన యువతకు ఉపాధి కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలతో నివేదికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించాలని సంక్షేమ వసతి గృహాల అధికారులను ఆదేశించారు. సమావేశంలో సీపీఓ విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, సెరికల్చర్ అధికారి పద్మావతమ్మ, సంక్షేమ అధికారులు శివరంగ ప్రసాద్, మోహన్ రావు, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి మల్లికార్జునప్ప, డీఎంహెచ్ఓ మంజువాణి, ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి, డీఆర్‌డీఏపీడీ నరసయ్య, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన కల్పించాలి

ప్రశాంతి నిలయం: విద్యార్థి దశలోనే పోషకాహారంపై అవగాహన కల్పిస్తే భావి సమాజం దృఢంగా ఉంటుందని, తద్వారా 'వికసిత్ భారత్' సాధ్యమవుతుందని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. జాతీయ పోషకాహార మాసోత్సవాలను పురస్కరించుకుని ఐసీడీఎస్ రూపొందించిన పోస్టర్లను శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ చేతన్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ పోషక ఆహారం అందించాలన్నదే జాతీయ పోషకాహార మాసోత్సవాల ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి నాగ మల్లేశ్వరి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మా టీచర్ మాకే కావాలి



టీచరు బదిలీని రద్దు చేయాలంటూ పాఠశాల ఆవరణలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

- టీచర్ బదిలీ రద్దు చేయాలని విద్యార్థుల ఆందోళన
- పాఠశాలకు తాళం వేసి తరగతుల బహిష్కరణ

పరిగి: చిన్నారులు తల్లిదండ్రుల తర్వాత గురువులను మార్గదర్శకులుగా భావిస్తారు. కాస్త ప్రేమ చూపే ఉపాధ్యాయులపై మమకారం పెంచుకుంటారు. వారు ఒక్కరోజు పాఠశాలకు రాకపోయినా ఆరా తీస్తారు. అలాంటిది ఏకంగా బదిలీ అయితే...మేమొప్పుకోమంటారు. మండల పరిధిలోని పెద్దిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇలాంటి పరిస్థితే తలెత్తింది. పాఠశాలలో పనిచేసే భాగ్యలక్ష్మి అనే ఉపాధ్యాయురాలంటే పిల్లలందరికీ ఎంతో ఇష్టం. కొన్నేళ్లుగా పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థులకు మార్గదర్శకంగా ఉంటూ అందరి మన్ననలు పొందారు. అయితే మూడు రోజుల క్రితం సర్దుబాటులో భాగంగా విద్యాశాఖ ఉన్నతాధికారులు భాగ్యలక్ష్మిని మండలంలోని శ్రీరంగరాజుపల్లికి బదిలీ చేశారు. అయితే విద్యార్థులు ఆమె బదిలీని జీర్ణించుకోలేకపోయారు. 'మా టీచర్ మాకే కావాలి... మా మేడంను బదిలీ చేయొద్దు' అంటూ సోమవారం తరగతులు బహిష్కరించారు. తల్లిదండ్రులతో కలిసి పాఠశాలకు తాళం వేసి ఆందోళనకు దిగారు. తమ టీచర్‌ను ఇక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు. అంతవరకూ తరగతులకు హాజరుకాబోమని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ విషయంపై ఎంఈఓ లక్ష్మీదేవి స్పందిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు పెద్దిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా టీచర్లను సర్దుబాటు చేశామన్నారు. పాఠశాలలో 82 మంది విద్యార్థులు ఉన్నారని, అందువల్ల నిబంధనల మేరకు అక్కడ ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉండాలన్నారు. ఈ క్రమంలో సర్‌ప్లస్‌గా ఉన్న భాగ్యలక్ష్మిని శ్రీరంగరాజుపల్లికి బదిలీ చేశామన్నారు. పాఠశాలలో మరో 10 మంది విద్యార్థులు పెరిగితే తప్పకుండా టీచరును నియమించేందుకు వీలుంటుందన్నారు.

రసవత్తరం.. ఫలితం ఖాయం



వికెట్ తీసిన ఆనందంలో ఇండియా–డి జట్టు ఆటగాళ్లు



స్టేడియంలో యువత సందడి..

- హోరాహోరీగా దులీప్ ట్రోఫీ మ్యాచ్
- 5 వికెట్లతో చెలరేగిన మనవ్ సుతార్
- ఇరు జట్లలో ముగ్గురు హాఫ్ సెంచరీలు

అనంతపురం: దులీప్ ట్రోఫీలో భాగంగా అనంత క్రీడాగ్రామం ప్రధాన స్టేడియంలో ఇండియా –సి, ఇండియా – డి జట్ల మధ్య రెండో రోజు శుక్రవారం జరిగిన మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఒకే రోజు ఇండియా–సి జట్టు మిడిలార్డర్ బ్యాటర్ ఇంద్రజిత్, ఇండియా–డి జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, పడిక్కల్ అర్ధసెంచరీలతో అలరించారు. ఇండియా –సి బౌలర్ మనవ్ సుతార్ ఐదు వికెట్లతో చెలరేగిపోయాడు. క్రికెట్ అభిమానుల కేరింతలతో స్టేడియం హోరెత్తింది. ఇరు జట్ల బౌలర్లు పోటాపోటీగా రాణిస్తుండటంతో మ్యాచ్ రసవత్తరంగా మారింది. మూడో రోజు శనివారమే మ్యాచ్ ఫలితం తేలే అవకాశం కనిపిస్తోంది. శుక్రవారం ఆట ముగిసే సమయానికి ఇండియా –డి జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 49 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసింది. ప్రస్తుతం ఇండియా–డి జట్టు 202 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతోంది.





మ్యాచ్ తిలకిస్తున్న అభిమానులు, టాటూలతో శిఖర్ దావన్ అభిమాని శంకర్ గీతా ధావన్

ఆదుకున్న ఇంద్రజిత్

ఓవర్‌నైట్ స్కోరు 91/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా–సి జట్టు 48.3 ఓవర్లలో 168 పరుగులకే ఆలౌట్ అయింది. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ బాబా ఇంద్రజిత్ 149 బంతులు ఎదుర్కొని 9 ఫోర్లతో 72 పరుగులు చేశాడు. ఇండియా–డి బౌలర్లలో పేసర్ హర్షిత్ రాణా 4, అక్షర్ పటేల్ 2, సరాన్ష్ జైన్2, అర్షదీప్ సింగ్, ఆదిత్య థాక్రే చెరో వికెట్ తీశారు.

సుతార్ దెబ్బకు తడబడిన ఇండియా–డి

తొలి ఇన్నింగ్స్‌లో లాగే రెండో ఇన్నింగ్స్‌లోనూ ఇండియా–డి జట్టు తడబడింది. ఇండియా–సీ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మనవ్ సుతార్ 15 ఓవర్లలో 30 పరుగులిచ్చి పడిక్కల్, శ్రీకర్ భరత్, సరాన్ష్ జైన్, అర్షదీప్, రికీ భుయిలను పెవిలియన్‌కు పంపాడు. అతనికి తోడుగా పేసర్ వైశాక్ రెండు వికెట్లు తీసి రాణించాడు. దీంతో ఇండియా–డి ఆట ముగిసే సమయానికి 8 వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసింది. క్రీజులో అక్షర్‌పటేల్ (11), హర్షిత్ రాణా (0) ఉన్నారు. శ్రేయస్ అయ్యర్ 44 బంతుల్లో 9 ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 54 పరుగులు, పడిక్కల్ 70 బంతుల్లో 8 బౌండరీలతో 56 పరుగులు చేశారు. మరో బ్యాటర్ రికీ భుయి 44 (5 ఫోర్లు, ఒక సిక్సర్) పరుగులు చేశాడు.



ఇండియా డీ - ఇండియా సీ మధ్య మ్యాచ్





శ్రేయస్ అయ్యర్ (54) పడిక్కల్ (56)

గ్రౌండ్‌లోకి దూసుకెళ్లిన అభిమాని..

రెండో రోజు ఆట జరిగే సమయంలో ఓ అభిమాని స్టేడియంలోకి పరుగెత్తుకుంటూ వెళ్లి మిడాన్‌లో ఫీల్డింగ్ చేస్తున్న ఇండియా–సి జట్టు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు పాదాభివందనం చేశాడు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

అభిమాన శిఖరం

రెండోరోజు స్టేడియంలో ముష్టూరు గ్రామానికి చెందిన శంకర్ గీతా ధావన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. భారత స్టార్ క్రికెటర్ శిఖర్ ధావన్ వీరాభిమాని అయిన గీతా ధావన్ రూ.13 లక్షలు ఖర్చు పెట్టి తన శరీరంపై శిఖర్ ధావన్ ఫొటోలతో కూడిన టాటూలు వేయించుకున్నాడు. శిఖర్ ధావన్ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసినప్పటి నుంచి చేసిన స్కోర్లు, సెంచరీలు టాటూలో పొందుపరిచాడు. శిఖర్ ధావన్ ఎక్కడకెళ్లి మ్యాచ్ ఆడినా అక్కడ ప్రత్యక్షమవుతాడు. దీంతో మురిసిపోయిన శిఖర్ ధావన్ రూ.20 వేల విలువైన తన వాచ్‌ను శంకర్ గీతా ధావన్‌కు బహుమానంగా ఇచ్చాడు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి

పుట్టపర్తి టౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి సూచించారు. వైద్య సిబ్బందితో కలసి పుట్టపర్తిలోని గోకులం కరణం సుబ్బమ్మ నగర్‌లో శుక్రవారం ఆమె పర్యటించారు. పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వల్లో దోమ లార్వాలను పరిశీలించారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలన్నారు. సాయంత్రం సమయంలో వేపాకు పొగ వేయాలన్నారు. మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి కుళ్లాయప్ప నాయక్, డాక్టర్ జ్యోత్స్న, సీహెచ్ఓ నగేష్, ఏఎంఓ లక్ష్మీనాయక్, ఎస్‌యూఓ రమణయ్య, ఆరోగ్య కార్యకర్తలు అజీజ్‌ఖాన్, సుహాసిని, ఆశా కార్యకర్త అమృత, తదితరులు పాల్గొన్నారు.

పశుశాఖ ఏడీలకు పదోన్నతి బదిలీ



డాక్టర్ వెంకటస్వామి

అనంతపురం అగ్రికల్చర్: పశు సంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ జీపీ వెంకటస్వామికి జేడీఏహెచ్‌గా పదోన్నతి కల్పిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన పెనుకొండ షీప్‌ఫారం డీడీగా పనిచేస్తూ ఇటీవల ఇన్‌చార్జి జేడీగా బాధ్యతలు తీసుకున్న విషయం తెలిసిందే. తాజా ఉత్తర్వులతో ఆయన పశుశాఖ రెగ్యులర్ జేడీగా పనిచేయనున్నారు. అలాగే అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా పనిచేస్తున్న ఇరువురికి డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో ఉరవకొండ ఏరియా ఆసుపత్రి ఏడీ డాక్టర్ ఎం.కాంతమ్మకు డీడీగా పదోన్నతి ఇస్తూ పెనుకొండ షీప్ ఫారానికి బదిలీ చేశారు. అలాగే యల్లనూరు ఆసుపత్రి ఏడీ డాక్టర్ ఎన్.మల్లారెడ్డిని నెల్లూరు జిల్లా కావలి డీడీగా బదిలీ చేశారు. విజయనగరం జిల్లా తెర్లాంలో ఏడీగా ఉన్న డాక్టర్ కె.నాగరాజు... పెనుకొండ డీడీగా బదిలీ అయ్యారు. పెనుకొండ డీడీ డాక్టర్ సత్యప్రకాష్‌ను శ్రీకాకుళం జిల్లా డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా డిప్యుటేషన్ కింద బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు.

జలం.. గరళం



- హిందూపురానికి చెందిన శ్రీరాములు వెన్నెముక సమస్యతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాడు. దీర్ఘకాలంగా కలుషిత నీరు తాగడమే ఇందుకు కారణంగా వైద్యులు నిర్ధారించారు. తమ ఇంటికి సమీపంలో ఉన్న వాటర్ ప్లాంట్ నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నామని, అయితే అనారోగ్యం బారిన పడతానని పసిగట్టలేకపోయానని బాధితుడు వాపోయాడు.
- కదిరి పట్టణానికి చెందిన నారాయణప్ప కీళ్ల నొప్పులతో స్థానిక ఏరియా ఆస్పత్రికి వెళ్లాడు. పరీక్షలు చేసిన అనంతరం తాగునీటి కారణంగానే ఈ సమస్య ఉత్పన్నమైనట్లుగా వైద్యులు తెలిపారు. ఓ ప్రైవేట్ వాటర్ ప్లాంట్ నిర్వాహకులు ఇంటి వద్దకే వచ్చి విక్రయిస్తున్న నీటిని కొన్నేళ్లుగా తాగుతున్నామని, అయితే నీటి కారణంగా కీళ్ల నొప్పులు వస్తాయని ఆలోచించలేదని బాధితుడు వాపోయాడు. తన ఈ దుస్థితికి కారణమైన వాటర్ ప్లాంట్ నిర్వాహకుడిపై అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

- ప్యూరిఫైడ్ వాటర్ పేరుతో ప్లాంట్ నిర్వాహకుల దందా
- సురక్షితమైన తాగునీటిని గుర్తించడంలో అధికారుల విఫలం
- ఎలాంటి అనుమతులు లేకుండానే వాటర్ ప్లాంట్ల నిర్వహణ
- నిబంధనలు తుంగలో తొక్కి ప్రజారోగ్యంతో చెలగాటం

సాక్షి, పుట్టపర్తి:

దాహం వేసినప్పుడు గొంతు తడుపుకునే నీరు కూడా విషమైంది. ధనార్జనే ధ్యేయంగా ప్యూరిఫైడ్ పేరుతో కొందరు కలుషిత నీటిని విక్రయిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. పల్లె, పట్టణం తేడా లేకుండా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు సరఫరా చేస్తున్న నీరు ఎంత వరకూ సురక్షితమనే అంశాన్ని పసిగట్టడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో చాలా మంది అనారోగ్యం బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. వైద్య పరీక్షల అనంతరం దీర్ఘకాలికంగా కలుషిత నీరు తాగడం వల్లనే ఈ దుస్థితి నెలకొన్నట్లుగా వైద్యులు నిర్ధారించడం గమనార్హం.

నిబంధనలు తుంగలోకి...

జిల్లాలోని పుట్టపర్తి, పెనుకొండ, హిందూపురం, ధర్మవరం, కదిరి, మడకశిర పట్టణాల్లో సుమారు 100కు పైగా వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. ఇందులో 80 శాతానికి పైగా ప్లాంట్లకు అనుమతులు లేవు. పల్లెల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్ల ద్వారా ఎలాంటి సమస్య లేదని అధికారులు చెబుతున్నా... పట్టణ ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా వెలసిన ప్రైవేటు వాటర్ ప్లాంట్ల కారణంగా ప్రజారోగ్యం దెబ్బతింటోంది. ఐఎస్ఐ నిబంధనలు తుంగలో తొక్కి ప్లాంట్లను నిర్వహిస్తుండడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. అధికారికంగా ఆమోదం పొందిన ప్లాంట్లను సైతం ఏటా రెన్యూవల్ చేసుకోకుండా నిబంధనలు ఉల్లంఘించి దందా కొనసాగిస్తున్నారు. ప్లాంట్ల ద్వారా ప్రజలకు చేరుతున్న నీటిలో నాణ్యతను పరీక్షించేందుకు మైక్రోబయాలజిస్టులు, కెమిస్టులు అందుబాటులో లేరు. దీంతో ప్యూరిఫైడ్ వాటర్ పేరుతో బోరు నీటినే ట్యాంక్‌ల ద్వారా సరఫరా చేస్తూ ప్రజారోగ్యంతో నిర్వాహకులు చెలగాటమాడుతున్నారు.

తనిఖీలు చేపడతాం



వాటర్ ప్లాంట్ల పని తీరుపై ఎప్పటికప్పుడు వివరాలు ఆరా తీస్తున్నాం. రెన్యూవల్ చేసుకోవాలని హెచ్చరిస్తున్నాం. నిబంధనలు పాటించని వారికి నోటీసులు ఇస్తున్నాం. తనిఖీలు చేపట్టి కలుషిత నీరు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదులు మా దృష్టికి వస్తే వెంటనే స్పందిస్తాం.
– రామచందర్, ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి

వ్యక్తి సజీవ దహనం

- ఘటనపై అనుమానాలు వ్యక్తం చేసిన భార్య



రవికుమార్ (ఫైల్)



మంటల్లో కాలిపోయిన టాటా ఏస్ వాహనం

పావగడ: తాలూకాలోని వీరమ్మనహళ్లి గేట్ వద్ద టాటాఏస్ వాహనం దగ్ధమైంది. డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... వైఎన్ హొసకోటకు చెందిన నేసే నారాయణప్ప కుమారుడు రవికుమార్ (44) టాటాఏస్ వాహనం ఏర్పాటు చేసుకుని అద్దెకు తిప్పుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి బాడుగ ఉండడంతో ఇంట్లో చెప్పి వాహనంతో పాటు బయలుదేరాడు. శుక్రవారం ఉదయం వీరమ్మనహళ్లి గేటు నుంచి పళవల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో రైల్వే బ్రిడ్జి వద్ద టాటాఏస్ వాహనం దగ్ధమై ఉండడం, డ్రైవర్ రవికుమార్ సజీవ దహనమైనట్లుగా గుర్తించిన స్థానికుల సమాచారంతో ఏఎస్పీ అబ్దుల్ రజాక్, సీఐ సురేష్, ఎస్ఐ గురునాథ్ అక్కడకు చేరుకున పరిశీలించారు. స్నిప్పర్ డాగ్‌ను రంగంలో దించి ఆధారాల కోసం గాలించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రవికుమార్ భార్య సహస్ర అక్కడకు చేరుకుని భర్త మృతదేహాన్ని చూసి బోరున విలపించింది. ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆమె చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వారి పరిస్థితి దారుణంగా ఉంది

- తాగునీటి పథకాల కార్మికుల దుస్థితిపై కలెక్టర్‌తో చర్చించిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి
- సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి



అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: ఉమ్మడి అనంతపురం జిల్లాలో సత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి పథకాల్లో పని చేస్తున్న వెయ్యికి పైగా కార్మికుల పరిస్థితి దారుణం ఉందని, జీతాలు అందక దుర్భర పరిస్థితుల్లో బతుకీడుస్తున్న వారి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను ఆయన కలసి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలంటూ కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో నిరవధిక సమ్మెలోకి కార్మికులు వెళ్లారన్నారు. ఫలితంగా ఆరు నియోజకవర్గాల పరిధిలోని 910 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీలు సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని, పీఎఫ్ నిధులనూ పక్కదారి పట్టిస్తున్నాయని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోండి

పీఏబీఆర్ బ్యాక్ వాటర్ ప్రవాహం మీద హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి రూ.50 కోట్లతో చేసిన ప్రతిపాదనలకు గత ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, అయితే కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ ఈ ప్రక్రియపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధకరమని ఎమ్మెల్సీ అన్నారు. తక్షణమే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే కూడేరు మండల పరిధిలో రూ.82 కోట్లతో 132 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి వైఎస్ జగన్ సర్కార్ అనుమతులు జారీ చేసిందని, అయితే రెవెన్యూ శాఖ పరంగా ఐదెకరాల స్థలం కేటాయించి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ విజ్ఞప్తులు, సూచనలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. తాగునీటి పథకం కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని భరోసానిచ్చారు.

విద్యాపరంగా జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

- యూడైస్ సమీక్షలో రాష్ట్ర టెక్స్ట్ బుక్స్ డైరెక్టర్ రవీంద్రనాథరెడ్డి



మాట్లాడుతున్న రవీంద్రనాథరెడ్డి

పుట్టపర్తి: విద్యా పరంగా జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని మండల విద్యాశాఖాధికారులకు రాష్ట్ర టెక్స్ట్ బుక్స్ డైరెక్టర్ రవీంద్రనాథరెడ్డి సూచించారు. అటెండెన్స్, యూడైస్ అంశంపై బుక్కపట్నం డైట్ కళాశాలలో ఎంఈఓలతో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటు, విద్యార్థులు, టీచర్ల అటెండెన్స్, యూడైస్ అంశాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, ఏడీలు నాగరాజు, లాజర్, డీఓఈఓ రంగస్వామి, సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై అవగాహన ఉండాలి



పంటకోత ప్రయోగాలపై అవగాహన కల్పిస్తున్న సీపీఓ విజయ్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: పంట కోత ప్రయోగాలు నిర్వహించే సమయంలో పూర్తి అవగాహన కలిగి ఉండాలని సిబ్బందికి సీపీఓ విజయ్‌కుమార్ సూచించారు. పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఏఎస్ఓలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఎస్ఓ శ్రీనివాసనాయక్, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, పీఎంబీపీ పీడీ సుదర్శన్, హరి ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ.. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే చాలా వరకూ పంట నమోదు ప్రక్రియ పూర్తయిందన్నారు. ముందస్తుగా సాగు చేసిన పంటలను ఇప్పటికే తొలగిస్తుండడంతో పంట కోత ప్రయోగాలను నిర్వహించి సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి



శివరామిరెడ్డి (ఫైల్)

పావగడ/ పెనుకొండ: వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పావగడలోని రైస్‌గేజ్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో నివాసముంటున్న శివరామిరెడ్డి (67) శుక్రవారం సాయంత్రం 3 గంటలకు పెనుకొండ వద్ద జాతీయ రహదారి దాటుతున్న సమయంలో వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొంది. ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, తాలూకాలోని బి.అచ్చమ్మనహళ్లికి చెందిన చాలా కాలంగా రైస్ గేజ్ ఎక్స్ టెన్షన్‌లో ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. కొన్నాళ్ల క్రితం బెంగుళూరుకు వెళ్లిన ఆయన శుక్రవారం తిరిగి వస్తూ సోమందేపల్లి మండలం పందిపర్తిలోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు వైజంక్షన్ వద్ద బస్సు దిగి రోడ్డు దాటుతున్న సమయంలో ప్రమాదానికి లోనై మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ క్రీడాపోటీలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవాల సందర్భంగా ఉపాధ్యాయులకు ఈ నెల 8 నుంచి జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో పురుషులకు క్రికెట్, వాలీబాల్ పోటీలు, అశోక్ నగర్ ఇండోర్ స్టేడియంలో మహిళలు, పురుషులకు షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్ విభాగం పోటీలు, పురుషులకు బాస్కెట్‌బాల్ పోటీలు ఉంటాయి.


అక్రమంగా పశువులు తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



కంటైనర్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గోరంట్ల: అక్రమంగా పశువులను కేరళకు తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. అందిన సమాచారం మేరకు శుక్రవారం ఉదయం రెడ్డిచెరువు కట్ట సమీపంలో వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో అటుగా వచ్చిన హెవీ గూడ్స్ కంటైనర్‌ను ఆపి పరిశీలించామన్నారు. అందులో 41 పశువులను గుర్తించి, వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. పశువులు తరలిస్తున్న కేరళకు చెందిన ఆసీఫ్‌తో పాటు గుడిబండకు చెందిన కంటైనర్ యజమాని మంజునాథ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న పశువులను కర్ణాటకలోని తుమకూరులో ఉన్న గోశాలకు తరలించినట్లు వివరించారు.

గుర్తు తెలియని మహిళ దుర్మరణం



పరిగి: వాహనం ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని మహిళ దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు... కొడికొండ చెక్‌పోస్టు నుంచి కర్ణాటకలోని శిరాకు వెళ్లే జాతీయ రహదారిపై ధనాపురం క్రాస్ వద్ద శుక్రవారం వేకువజాము 1.30 గంటల సమయంలో నడుచుకుంటూ వెళుతున్న మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కొంతకాలంగా హొన్నంపల్లి, ధనాపురం క్రాస్ పరిసరాల్లో ఆమె ఒంటరిగా సంచరిస్తున్నట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. ఘటనపై ఎస్ఐ రంగడు యాదవ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు 94409 01879కు సమాచారం అందించాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య



మృతురాలు సునీత

పెనుకొండ రూరల్: జీవితంపై విరక్తితో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం గొందిపల్లికి చెందిన సోమశేఖరరెడ్డి, సునీత (32) దంపతులకు ఓ కుమారుడు ఉన్నాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న సునీతకు కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి నొప్పి తీవ్రతతో బాధపడిన ఆమె జీవితంపై విరక్తితో శుక్రవారం తెల్లవారు జామున క్రిమి సంహారక మందు తాగింది. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను వెంటనే పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం జీజీహెచ్‌కు తరలించారు.చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది. ఘటనపై కియా ఏఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

గార్లదిన్నె: విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం యర్రగుంట్ల గ్రామానికి చెందిన నాగార్జున (33) వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కూలీలతో కలసి తన తోటలో పనిచేస్తున్న ఆయన నీళ్ల కోసం మోటార్‌ను ఆన్ చేసేందుకు స్టార్టర్ పెట్టె తీస్తుండగా షాక్‌కు గురై కుప్పకూలాడు. కూలీల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని అపస్మారక స్థితిలో పడి ఉన్న నాగార్జునను వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

తల్లి, ఇద్దరు పిల్లలను కాపాడిన పోలీసులు



బాధితురాలితో మాట్లాడుతున్న పోలీసులు

హిందూపురం అర్బన్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఇద్దరు పిల్లలతో కలసి ఆత్మహత్యాయత్నం చేయబోయిన తల్లిని సకాలంలో పోలీసులు కాపాడారు. వివరాలు... భీమవరానికి చెందిన శివశంకర రెడ్డి, చైత్ర 12 ఏళ్ల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరి కుమారులు ఉన్నారు. ఉపాధి కోసం హిందూపురానికి వలస వచ్చి సూరప్పకట్ట అంబేడ్కర్ నగర్‌లో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని శివశంకర రెడ్డి పోషించుకుంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో చిన్నపాటి అంశానికి దంపతుల మధ్య గొడవ చోటు చేసుకుంది. దీంతో క్షణికావేశానికి లోనైన చైత్ర ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని సాయంత్రం తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఎంజీఎం మైదానం సమీపంలో ఉన్న రైలు పట్టాల వద్దకు చేరుకుంది. ఆమె ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో గమనించిన స్థానికులు డయల్ 100కు సమాచారం అందించారు. దీంతో రెండో పట్టణ ఏఎస్ఐ వెంకటరమణనాయక్, జమేదార్ సుధాకర్, కానిస్టేబుల్ రామాంజి అక్కడికి చేరుకున్నారు. అప్పటికే పట్టాలపై దూసుకువస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలును గమనించి పరుగున వెళ్లి చైత్రతో పాటు పిల్లలను పక్కకు లాగారు. విచారణ అనంతరం స్టేషన్‌కు పిలుచుకెళ్లి భర్తను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం భార్యభర్తలను కలిపి సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించి ఇంటికి పంపారు.

గర్భిణుల కోటాకు మళ్లీ కోత

తాడిపత్రి రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహార సరుకులపై కోత పడుతూనే ఉంది. గత నెల మూడు కిలోల చొప్పున బియ్యం ప్యాకెట్లు, వంట నూనె సరఫరా కాలేదు. ఈ నెల కూడా సరుకులు సరఫరా కాకపోవడంతో పౌష్టికాహారం ఎలా వండి పెట్టాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. తాడిపత్రి ప్రాజెక్టు పరిధిలో 302 అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంఎల్ఎస్ పరిధిలోని పుట్లూరు, యల్లనూరు మండలాల్లో 95 సెంటర్లు ఉన్నాయి. మొత్తం 3,400 మంది గర్భిణులు, బాలింతలు.. 4,400 మంది ప్రీ స్కూల్ పిల్లలు ఉన్నారు. తాడిపత్రి మున్సిపాలిటీతో పాటు రూరల్ పరిధిలో దాదాపు 1,800 మంది బాలింతలు, రెండు వేలకు పైగా ప్రీ స్కూల్ పిల్లలకు ప్రతి నెలా ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి పౌష్టికాహార సరుకులు అందజేస్తుంటారు. ఆగస్టులో స్టాక్ తక్కువగా వచ్చిందని సరుకులు సరఫరా చేయలేదు. ఈ నెలకు సంబంధించి తాడిపత్రి మునిసిపాలిటీతో పాటు మండల వ్యాప్తంగా ఇప్పటి వరకూ సరుకులు అందలేదు. ఈ అంశంపై జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ... బియ్యం ప్యాకెట్లు, నూనె ఎందుకు సరఫరా కాలేదో విచారణ చేస్తామన్నారు.